సాక్షి సంగారెడ్డి
సోమవారం, 9, జనవరి, 2023



ప్రకృతిపై 'రుతుప్రేమ' 8లో

సిద్దిపేట మహిళలు ఓ చక్కటి ఆలోచనతో నెలసరి సమయంలో సిలికాన్ కప్పులు, శానిటరీ క్లాత్ ప్యాడ్‌లు వినియోగిస్తూ పర్యావరణాన్ని కాపాడుతున్నారు.



ఉచిత బియ్యం 5 కిలోలేనా?

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత రేషన్ బియ్యం ఐదు కిలోలే ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంతో పేద కుటుంబాలు తీవ్ర నిరాశకు గురవుతున్నాయి. 8లో



సర్కారు బడి.. సమస్యల ఒడి 9లో

జీహెచ్‌ఈఎల్ జెడ్పీహెచ్ పాఠశాల నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

న్యూస్‌రీల్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సీఐటీయూ కార్యాలయంలో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవాణా రంగ కార్మికుల సంఘర్ష యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సంఘర్ష యాత్ర ఈనెల 11వ తేదీ వరకు జరుగుతుందన్నారు. అదే రోజు బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు జిల్లాలోని ఆటో, స్కూల్ బస్ డ్రైవర్లు, డీసీఎం, ట్రాలీ, టాక్సీ, వ్యాన్, అద్దె బస్సులు, ఆర్టీసీ, ట్రాక్టర్ డ్రైవర్లు, తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు వేలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, మహేందర్, శ్రీనివాస్, మధు, రాహుల్, అశోక్, శంషుద్దీన్, లక్ష్మణ్, బాబా, మల్లేశం, రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఏడుపాయల

అమ్మవారిని దర్శించుకున్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఎల్లలుదాటి తరలి వచ్చిన భక్తులతో ఏడుపాయల ఆలయం ఆదివారం కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు బారులుతీరి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా భక్తులు ఒడి బియ్యం పోసి బోనాలు తీసి తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పాలకవర్గం చైర్మన్ బాలాగౌడ్, ఈవో శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ సునీతారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.



సునీతారెడ్డిని సన్మానిస్తున్న ఈఓ

కన్న ఊరిపై మమకారం

మాతృభూమి సేవలో ఎన్‌ఆర్‌ఐలు

- సొంత నిధులతో అభివృద్ధికి శ్రీకారం
- నేడు ప్రవాసీ భారతీయ దివస్

ఊరు మనకేం చేసిందనే ఆలోచన వదిలి.. ఊరికి మనమేం చేయాలో ఆలోచిస్తుంటారు కొందరు. తాము పుట్టి పెరిగిన గ్రామాన్ని అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తుంటారు. అలాంటి వారిలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర మరువలేనిది. ప్రపంచంలో ఎక్కడ స్థిరపడినా కన్న ఊరికి సొంత నిధులతో చేయూతనందించి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ప్రత్యేక కథనాలు..



ఉచితంగా వైద్యం అందించేందుకు నిర్మించిన భవనం



ఉజ్వల్‌రెడ్డి

చిరాగ్‌పల్లి శ్రీమంతుడు

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని చిరాగ్ పల్లి గ్రామానికి చెందిన ఎస్.ఉజ్వల్ రెడ్డి అమెరికాలో స్థిరపడినా సొంత ఊరిని మరిచిపోలేదు. గ్రామానికి నిరంతరంగా సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మూడేళ్ల క్రితం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 20 కంప్యూటర్లను బహూకరించారు. ప్రత్యేకంగా ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు. రూ.3 లక్షలతో పాఠశాలకు బెంచీలను ఏర్పాటు చేయించారు. గ్రామంలో 20 సోలార్ లైట్లను ఏర్పాటు చేయించారు. ఇందుకోసం రూ.20 లక్షలు ఖర్చు చేశారు. గ్రామస్తులకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఆస్పత్రి భవనం నిర్మించారు. త్వరలో అందుబాటులోకి రానుంది. రెండు బోర్లను వేయించి దాహార్తిని తీర్చారు. గతేడాది వేసవిలో జహీరాబాద్‌లో అంబలి, లస్సీ కేంద్రం ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చారు. కరోనా కష్టకాలంలో 500వరకు ఆక్సిజన్ సిలిండర్లను, కాన్సంట్రేటర్లను జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంచారు. రూ.80 వేలతో ప్రభుత్వ ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్ అందజేశారు. ఇలా ఉజ్వల్ రెడ్డి గ్రామానికి సేవలందిస్తూ శ్రీమంతుడు అనిపించుకుంటున్నారు.

సేవలో మిన్న..

డాక్టర్ మాధవిదంపతులు



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన డా.మాధవి పెళ్లై భర్త డా.శ్రీకాంత్‌తో కలిసి కెనడాలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నా పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలను మరచిపోలేదు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రతియేటా లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో మాసాయిపేట ఉన్నత పాఠశాలకు రూ.1.30 లక్షలతో సైన్స్ ల్యాబ్ పరికరాలు, రూ.లక్షతో క్రీడాసామగ్రి అందజేయడంతోపాటు రూ.5లక్షలతో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా డెస్క్ బెంచ్‌లు, విద్యుత్ సౌకర్యం, తరగతి గదులకు పెయిటింగ్, రంగులు వేయించారు. ఉన్నత పాఠశాల ఆవరణలోనే సుమారు రూ.50 లక్షలతో సైన్స్ ల్యాబ్, లైబ్రరీలకు పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. ప్రతీయేటా గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డా. శ్రీకాంత్ దంపతులను పలువురు అభినందిస్తున్నారు.

చెర్ల కుటుంబం ఔదార్యం

కోహీర్(జహీరాబాద్): పుట్టి పెరిగిన ఊరికి సేవ చేయాలనే సంకల్పంతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అమెరికాలో స్థిరపడిన చెర్ల కుటుంబ సభ్యులు విద్యార్థులను ప్రోత్సహించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. చెర్ల వెంకట్‌రెడ్డి 30 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నారు. అయితే తను ఈ స్థితికి రావడానికి ప్రధాన కారణం చదువే అని గ్రహించి విద్యాభివృద్ధికి పాటుపడుతున్నారు. చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలలో ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలని సంకల్పించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతిభగల ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి ఒక్కో విద్యార్థికి రూ.1,500 చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తున్నారు. దీనికోసం ప్రతి ఏడాది రూ.20 వేలు ఖర్చు చేస్తున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం ఆగస్టు 15న రూ.15 వేలతో విద్యార్థులందరికీ స్వీట్ బాక్స్‌లు అందజేస్తున్నారు. 2014లో గ్రామస్తుల కోరికమేరకు రూ.5 లక్షలతో బస్‌షెల్టర్ నిర్మించారు. అమెరికా వెళ్లి స్థిరపడిన తను పుట్టి పెరిగిన ఊరిని మరవకుండా విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.





చెర్ల కుటుంబం తరుపున స్కాలర్‌షిప్ అందజేస్తున్న సర్పంచ్ నర్సింహులు(ఫైల్), (ఇన్‌సెట్‌లో)చెర్ల వెంకట్‌రెడ్డి దంపతులు

పేదలను మరువని డాక్టర్



రామాయంపేట(మెదక్): అత్యంత పేదస్థితిలో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి అమెరికాలో స్థిరపడ్డ ఆ డాక్టర్... తాను పుట్టిన గడ్డను, పేదలను మరువలేదు. అమెరికాలోని ఫ్లోరిడాలో ప్రముఖ డాక్టర్‌గా పేరు ప్రతిష్టలు గాంచిన ఎన్‌ఆర్‌ఐ ఎంతో సేవ చేస్తున్నారు.
వివరాల్లోకి వెళ్లే... నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన దొంతినేని రామారావు, శశిరేఖ దంపతులకు ఇద్దరు కుమారులతోపాటు కూతురు ఉన్నారు. వీరిలో శ్రీనివాసరావు రెండో కుమారుడు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం చల్మెడ శివారులోని కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఇస్సానగర్‌లో కొనసాగింది. ఉన్నత చదువులు చదివి విజయవాడలోని ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఎం.డీ (ఇంటర్నల్ మెడిసన్) పూర్తి చేసి ప్రస్తుతం ఫ్లోరిడాలో ప్రముఖ డాక్టర్‌గా పేరుగాంచారు. ఎంత ఎదిగిన చల్మెడతోపాటు తాను చదువుకున్న ఇస్సానగర్‌ను మరువలేదు. రామాయంపేట కేంద్రంగా కొనసాగుతున్న వివేకానంద ఆవాస విద్యాలయంలో చదువుతున్న పేద విద్యార్థులను దత్తత తీసుకొని ప్రతీ సంవత్సరం రూ.లక్షన్నర పంపుతున్నారు. అలాగే ఇస్సానగర్ గ్రామస్తులకు తాగునీటి వసతి కల్పించడానికి రూ.8లక్షల వరకు ఖర్చుచేసి వాటర్ ప్యూరిఫై మిషన్ ఏర్పాటు చేయించారు. సంగారెడ్డిలో రూ.5లక్షలతో భారతీయ కిసాన్ సంఘ్ భవన నిర్మాణానికి సాయం అందజేశారు. రెండేళ్లక్రితం డాక్టర్ శ్రీనివాసరావు తండ్రి రామారావు మృతిచెందగా, ఆయన జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు.

నా కష్టం ఇతరులకు రావొద్దు



నేను పడ్డ కష్టం ఇతరులకు రావొద్దనే ఉద్దేశంతో సాధ్యమైనంత మేర పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు అందజేస్తున్నాను. పేద విద్యార్థులు చదువుకునేలా కృషి చేస్తున్నాను. వైద్యపరంగా ఈ ప్రాంత ప్రజలకు తోడ్పాటు అందించడానికి స్నేహితులతో కలిసి కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– డాక్టర్ శ్రీనివాసరావు

ఊరికి ఉపకారం..

బెజ్జంకి(సిద్దిపేట): పుట్టి పెరిగిన ఊరి గ్రామస్తుల సౌకర్యం కోసం రూ. కోటితో ఫంక్షన్‌హాల్ నిర్మించి ఆదర్శంగా నిలిచారు దంపతులు. మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన కేడిక బాల్‌రెడ్డి భార్య నాగరాణి సుమారు 40 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ వీరు ఇద్దరు మంచి ఉద్యోగాలు చేస్తుండగా వారి కుమారులిద్దరూ డాక్టర్లుగా స్థిరపడ్డారు. తమగ్రామ ప్రజలకు అవసరమైనవి సమకూర్చాలనే సంకల్పంతో బంధువులు, గ్రామస్తులతో చర్చించారు. అందరికీ ఉపయోగంగా ఉండేలా సుమారు రూ. కోటి వెచ్చించి తమ తల్లిదండ్రులు కేడిక సత్తమ్మ–రాంరెడ్డిల స్మారకార్థం ఫంక్షన్‌హాల్ నిర్మించి ఔదార్యం చాటుకున్నారు. అంతే కాకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతి నెల వెయ్యి రూపాయలు వెచ్చించి తాగు నీరు అందిస్తున్నారు.

అమ్మో చిరుత

భయాందోళనలో రాయికోడ్ మండల ప్రజలు



తాటిపల్లి శివారులో చిరుత పులి(సర్కిల్‌లో..)

మునిపల్లి/రాయికోడ్(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో చిరుత పులి సంచారంతో ప్రజలు భయందోళనతో ఇంటికే పరిమితమయ్యారు. ఆదివారం మండలంలోని తాటిపల్లి, పెద్దలోడి, చీలపల్లి, గార్లపల్లి, పిల్లోడి, రాయికోడ్ మండలం హస్నాబాద్, సంగాపూర్ గ్రామాల్లో పులి సంచరిస్తున్నట్లు ప్రజలకు తెలియడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. ఆయా గ్రామాల్లో చిరుత సంచరిస్తున్నట్లు ప్రజలకు తెలియడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. తాటిపల్లి, పిల్లోడి గ్రామాల మధ్య వ్యవసాయ దుక్కిలో పడుకొని ఉన్న పులిని ఓ రైతు తన ఫోన్‌లో ఫొటో తీసి వాట్సాప్ గ్రూపులో షేర్ చేశాడు. దీంతో రైతులు, కూలీలు పనులకు వెళ్లడం మానేశారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు తాటిపల్లి, పిల్లోడి గ్రామాల్లో చిరుతపులి అడుగులను గమనిస్తూ కొంత దూరం వెళ్లారు. చిరుత సంచారంపై త్వరలోనే తెలియజేస్తానని ఫారెస్ట్ బీట్ అధికారి ఎండీ ఇనాయత్ అలీ తెలిపారు.

సేవాలాల్ జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలి

నారాయణఖేడ్: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని లంబాడి హక్కుల పోరాటసమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు సురేశ్‌నాయక్ డిమాండ్‌చేశారు. ఆదివారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన డివిజన్‌స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. దేశంలో 12 కోట్లు, రాష్ట్రంలో 40 లక్షల గిరిజన జనాభా ఉందన్నారు. నియోజకవర్గంలోని తండాలకు రోడ్ల కోసం నిధులు మంజూరయ్యాయని, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్, నాయకులు నగేశ్, శ్రీరాం, రాజు, మహేశ్, వినోద్, గణేశ్, సికిందర్, నరేశ్ పాల్గొన్నారు.

ప్రతిభను చాటేందుకే టోర్నీలు

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామీణ ప్రాంతాల్లో టోర్నీలు నిర్వహించడం ద్వారా యువకులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి దోహదపడుతాయని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. న్యాల్‌కల్ గ్రామ సమీపంలో ఐదు రోజులుగా నిర్వహించిన పీర్‌గైబ్ సాహేబ్ దర్గా క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. టోర్నీలో హద్నూర్, చీలపల్లి తండా జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో హద్నూర్ జట్టు విన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ శకీల్ సొంత డబ్బు రూ.30వేలు అందజేశారు. రన్నర్ జట్టుకు గుంజోటి ఎంపీటీసీ సభ్యుడు దెొట్టి పాటిల్ సొంత డబ్బు రూ.15వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతీభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారు తమ ప్రతిభను ఇలాంటి టోర్నీల ద్వారా నిరూపించుకోవచ్చునన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు తన్వీర్, భాస్కర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు పెంటారెడ్డి, మాతంశెట్టి రాజ్‌కుమార్, బస్వరాజ్, శివుస్వామి, సంజీవయ్య, మక్సూద్ మియా, ఖలీల్, వసీం, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

భయం గుప్పిట్లో విధులు!

పారిశ్రామిక వాడల్లో తరచు ప్రమాదాలు

- కనీస రక్షణ చర్యలు చేపట్టని యాజమాన్యాలు
- ప్రాణాలను కోల్పోతున్న కార్మికులు
- మృతుల్లో ఇతర రాష్ట్రాల వారే ఎక్కువ

జిన్నారం(పటాన్‌చెరు): పారిశ్రామిక వాడలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. యాజమాన్యాల నిర్లక్ష్యంతో విలువైన కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. దీంతో భయం గుప్పెట్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పుడు ఏ పరిశ్రమలో ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ పని చేస్తు బతుకు వెల్లదీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పారిశ్రామిక వాడల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా ఇతర రాష్ట్రాల కార్మికులే చనిపోతున్నారు. జిన్నారం మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని మైలాన్ యూనిట్ – 1 పరిశ్రమలో ఆదివారం రసాయనాలను మార్చుతున్న సమయంలో రాపిడి వల్ల మిరుగులు రావటంతో ఒక్కసారిగా పేలుడు జరిగింది. రసాయనాలు బయటకు చిమ్మటంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ కోటేశ్వర్‌రావుతో పాటు మరో ఇద్దరు కార్మికులు పరితోష్ మెహతా, రంజిత్‌కుమార్‌లు అక్కడికక్కడే కాలి బూడిదయ్యారు. ఈ ఘటన పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలపై తీవ్ర చర్చనీయాంశమైంది.

తెలిసినవి కొన్ని.. తెలియనివి ఎన్నో!

- పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండలం బొల్లారం, గడ్డపోతారం, ఖాజపల్లితో పాటు గుమ్మడిదల మండలంలోని అన్నారం, బొంతపల్లి, దోమడుగు తదితర పారిశ్రామిక వాడల్లో మూడు వందలకుపైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 80 శాతం రసాయన పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యం, నిపుణులైన కార్మికులు, సిబ్బంది లేకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.
- గతంలో అన్నారంలోని మోల్డ్‌టెక్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడి తల మిషన్‌లో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదాన్ని బయటకు పొక్కకుండా యాజమాన్యం వ్యవహరించింది.
- బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ ఐరెన్ పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుడుడిపై ఐరెన్ పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. గడ్డపోతారంలోని ఓ పరిశ్రమలో కూడా ఇటీవల ఓ ప్రమాదం జరిగింది. కాని యాజమాన్యం బయటకు రాకుండా చర్యలు తీసుకుంది.
- పరిశ్రమల్లో తరచు ప్రమాదాలు జరుతున్నప్పటికీ కొన్ని ఘనటలు బయటకు రాకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకుంటున్నాయి. దీంతో కార్మికులకు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియటం లేదు. యాజమాన్యాలకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులతో పాటు పోలీసులు కూడా సహకరిస్తుండటం వల్లనే ఘటనలు బయటకు రావటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



అనంతారంలోని ఓ పరిశ్రమలో జరిగిన ప్రమాద దృశ్యం(ఫైల్)



మైలాన్ పరిశ్రమలో ప్రమాద తీవ్రతను పరిశీలిస్తున్న పోలీసులు

బిక్కుబిక్కుమంటూ..

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కార్మికులు భయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. సరైన రక్షణ పరికరాలను కూడా యాజమాన్యాలు సమకూర్చడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. తమకు రక్షణ కల్పించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. లేని పక్షంలో పనులు చేయటం కష్టమని వాపోతున్నారు.

కార్మికులకు రక్షణ కరువైంది

పరిశ్రమల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు రక్షణ పూర్తిగా కరువైంది. మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.50లక్షల నష్టపరిహారాన్ని అందించాలి. కార్మికుల రక్షణ కోసం పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తున్నాం. కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకురావాలి.

– రాజయ్య, కార్మిక సంఘం నాయకులు

విచారణ జరుపుతున్నాం

పరిశ్రమల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు తగిన రక్షణను కల్పించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాల్సిందే. మైలాన్ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నాం. ప్రమాదాలు జరిగిన పరిశ్రమలకు నోటీసులకు అందించటంతో పాటు వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి

లింగాయత్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్

సదాశివపేట(సంగారెడ్డి): వీరశైవ లింగాయత్‌లు అన్ని రంగాల్లో రాణించాలని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. ఆదివారం సదాశివపేట పట్టణంలోని బసవ సేవాసదన్‌లో చౌకీమఠం వీరశైవ లింగాయత్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చౌకీమఠం అధ్యక్షుడిగా చీలమల్లన్న, ప్రధాన కార్యదర్శిగా పిల్లోడి విశ్వనాథం, కోశాధికారిగా పులిమామిడి వీరేశం, ఉపాధ్యక్షులుగా కోవూరి విజయ్‌కుమార్, గంతల బస్వరాజ్, సంయుక్త కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మహాత్మ బసవేశ్వరుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ బసవేశ్వరుడు సమాజంలో కుల, వర్ణ బేధాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయవాదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు ప్రసాది మధుశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్మిశెట్టి జయప్రకాష్, మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ, చౌకీమఠం వీరశైవలింగాయత్ సమాజం సభ్యులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్, పక్కన చింతా ప్రభాకర్

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ట్రాఫిక్ నిబంధనలను ప్రతీ ఒక్కరు పాటించాలని తొగుట ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వాహనదారులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనావాసాల ప్రదేశాల్లో వాహనాలను నెమ్మదిగా నడపాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. పెండింగ్ చలాన్లు వెంటనే క్లియర్ చేయాలని వాహనదారులకు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపితే చట్ట ప్రకాంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

హైవోల్టేజీతో కాలిపోయిన గృహోపకరణలు

నారాయణఖేడ్: హైవోల్టేజీ కారణంగా నారాయణఖేడ్ పట్టణంలోని వివేకానంద పాఠశాల సమీప వివేకానంద కాలనీలో దాదాపు 12 ఇళ్లల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, వాటర్ హీటర్లు, ఫ్యాన్లు, గీజర్లు తదితర గృహోపకరణాలు కాలిపోయాయి. కొన్ని రోజులుగా హైవోల్టేజీ వస్తోందని స్థానికులు తెలిపారు. స్విచ్‌బోర్డులను ముట్టున్నా విద్యుత్‌షాక్ తగులుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

చైనా మాంజా అమ్మితే కేసు

నారాయణఖేడ్: సంక్రాంతి పండగ సందర్భంగా గాలిపటాల ఎగురవేసే చైనా మాంజా అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఆదివారం హెచ్చరించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చైనా మాంజాతో చిన్నపిల్లలకు, రోడ్లపై రాకపోకలు సాగించేవారికి, పక్షులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

కల్హేర్(నారాయణఖేడ్): మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలో పలు కూడళ్లలో వాహనాలు తనిఖీ చేస్తుండా మద్యం తాగి 13 మంది పట్టుబడినట్లు తెలిపారు. నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ప్రియాంక సిరిసిల్ల రూ. 9,600 జరిమానా విధించినట్లు చెప్పారు.

చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి



చంద బాలయ్య (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. వర్గల్ మండలం గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సింగాయపల్లికి చెందిన చంద బాలయ్య(52), భారతి దంపతులు. వీరిక ముగ్గురు కొడుకులు గణేష్, బాలరాజు, కనకరాజు ఉన్నారు. బాలయ్యకు కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కొడుకులు కొంత భూమి అమ్మి అప్పులు తీర్చారు. మద్యానికి బానిసైన బాలయ్య జీవితంపై విరక్తితో శనివారం ఇంట్లోనే గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో కింద పడిపోయిన అతడిని కుటుంబీకులు గమనించి వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్సకోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం బాలయ్య మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రకృతిపై.. రుతుప్రేమ

- క్లాత్ ప్యాడ్‌లు, సిలికాన్ కప్పుల వినియోగం
- సిద్దిపేటలో నెలకు 8 టన్నుల హానికర చెత్త నియంత్రణ
- రుతుప్రేమపై లఘు చిత్రాలు, చైతన్యరథం ఏర్పాటు

సాక్షి, సిద్దిపేట: యువతులు, మహిళలు నెలసరి సమయంలో పరిశుభ్రంగా ఉండేందుకు శానిటరీ ప్యాడ్‌లు వినియోస్తారు. వాటి కారణంగా ఏర్పడే టన్నుల కొద్దీ చెత్తను, కాలుష్యాన్ని నివారించడం ఎలా? ఈ సమస్యకు పరిష్కారదిశగా సిద్దిపేట మహిళలు ఓ చక్కటి మార్గాన్ని ఆచరించి చూపిస్తున్నారు. వీరంతా సిలికాన్ కప్పులు, శానిటరీ క్లాత్ ప్యాడ్‌లు వినియోగిస్తూ ఇటు వ్యక్తిగత ఆరోగ్యం, అటు పర్యావరణాన్ని కాపాడుతున్నారు. ఖర్చు సైతం తగ్గించుకుంటున్నారు.

- సిద్దిపేట పట్టణంలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తూ తిరిగి పునర్ వినియోగిస్తున్నారు.
- తడి, పొడి చెత్త కాకుండా హానికరమైన చెత్త సిద్దిపేట మున్సిపాలిటీకి ఓ సవాల్‌గా మారింది. ముఖ్యంగా శానిటరీ ప్యాడ్‌లు, చిన్న పిల్లల డైపర్లు ఏం చేయాలన్నా దానికి సరైన మార్గం దొరకలేదు. ఇవి భూమిలో కలసిపోవాలంటే కొన్ని సంవత్సరాల సమయం పడుతుంది. కాల్చడం వల్ల హానికర వాయువులు విడుదలవుతాయి.
- రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రత్యేక చొరవతో పర్యావరణవేత్త డాక్టర్ శాంతి బృందం పునర్ వినియోగానికి అనువుగా ఉండే క్లాత్ ప్యాడ్‌లు, సిలికాన్ కప్పులు వినియోగమే సరైన పరిష్కారమనే నిర్ణయానికి వచ్చారు.

సిద్దిపేటలో శ్రీకారం

- ఈ కార్యక్రమానికి 'రుతుప్రేమ ' అనిపేరు పెట్టారు. మహిళలే సైగలు, కోడ్ భాషల్లో మాట్లాడుకునే నెలసరిపై సిద్దిపేట పట్టణంలోని 5వ వార్డులో గత ఏడాది ఏప్రిల్ 6వ తేదీన ఏకంగా బహిరంగసభనే నిర్వహించారు. ఇలా ఈ మార్పునకు సిద్దిపేటలో శ్రీకారం చుట్టారు.
- ముందుగా అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీల సాయంతో సర్వే నిర్వహించి నెలసరి సమయంలో మహిళలు అనుసరిస్తున్న శుభ్రతా విధానాల గురించి తెలుసుకున్నారు.
- తర్వాత క్లాత్‌తో తయారు చేసిన ప్యాడ్లు, మెడికల్ గ్రేడ్ సిలికాన్ కప్స్, చిన్నారులకు క్లాత్‌తో తయారు చేసిన డైపర్లను రుతుప్రేమ బృందం పరిచయం చేసింది.

లఘు చిత్రం ప్రదర్శన

రుతుప్రేమ పేరుతో ప్రత్యేక లఘు చిత్రాలను రూపొందించారు. శానిటరీ ప్యాడ్‌లకు బదులు క్లాత్ ప్యాడ్‌లు, సిలికాన్ కప్స్ వినియోగించాలని ఈ లఘు చిత్రం ద్వారా వివరిస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, మహిళా సంఘాల సమావేశాలలో ప్రదర్శస్తున్నారు.

- శానిటరీ ప్యాడ్‌లను కొనుగోలు చేసినట్టు మళ్లీమళ్లీ కొనాల్సిన అవసరం లేకుండా ఈ సిలికాన్ కప్పులను 8 నుంచి 10 ఏళ్ల వరకు వాడుకోవచ్చు.
- క్లాత్ ప్యాడ్‌లు అయితే మళ్లీ వాష్ చేసుకుని వినియోగించుకోవచ్చు. ఇలా వీటి వల్ల ఖర్చు కూడా తగ్గుతుంది. ఏడాదికి రూ 1,200 ఆదా చేయవచ్చు.
- సిలికాన్ కప్పులను వినియోగించే విధానంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సిద్దిపేట పట్టణంలో పలు వార్డుల్లో ఈ సిలికాన్ కప్పులను ఉచితంగానే అందచేస్తున్నారు.

పట్టణంలో 8 టన్నులు

ఒక్కో మహిళ సగటున నెలకు 8 నుంచి 10 వరకు ప్యాడ్‌లను వినియోగిస్తుంటారు. ఇలా వినియోగించి పడేసే ప్యాడ్‌లు సుమారుగా 50 ప్యాడ్‌లు కిలోన్నర వరకు ఉంటుంది. ఈ లెక్కన ప్రతి నెలా 8 టన్నుల హానికర చెత్తను డంపింగ్ యార్డుకు చేరకుండా ఆపగలిగారు. ఇలా హాని కరచెత్తను నియంత్రిస్తున్నారు. ప్యాడ్‌లు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలో వేయడం తగ్గింది.

జీరో శానిటరీ వేస్ట్ కోసం

- రుతు ప్రేమ కార్యక్రమం సత్ఫలితాలను ఇవ్వడంతో జీరో శానిటరీ వేస్ట్ మండలంగా చేసేందుకు పైలెట్ ప్రాజెక్ట్‌గా సిద్దిపేట జిల్లాలోని నారాయణరావుపేటను తీసుకున్నారు. ఇందు కోసం మహిళా అధికార బృందం బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ, సెట్విన్ అధికారి అమీనాలతో పాటు ఇతర శాఖల అధికారులను ఏర్పాటు చేశారు.
- జీరో శానిటరీ వేస్ట్ మండలం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. మండల పరిధిలోని 10 గ్రామాలల్లో ఉన్న యువతులు, మహిళలలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించిన అనంతరం పర్యావరణ పరిరక్షణతో పాటు, వ్యక్తిగత రక్షణకు మంచిని స్వీకరించి, చెడును వదిలేద్దాం అని ప్రతిజ్ఞ చేపిస్తున్నారు.
- పెళ్లి కాని యువతులు, వివాహమైన వారు ఎంత మంది ఉన్నారో వివరాలు సేకరించారు.
- పెళ్లి కాని 1,256 యువతులకు క్లాత్ ప్యాడ్‌లు, పెళ్లయిన 3,182 మంది మహిళలకు సిలికాన్ కప్పులను ఉచితంగా అందజేశారు.
- అంతకంటే ముందు సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని 5,7,37,43 వార్డుల్లో జీరో శానిటరీ వేస్ట్‌గా మార్చేందుకు ఉచితంగా క్లాత్ ప్యాడ్‌లు, సిలికాన్ కప్పులు అందజేశారు.

మహిళల ఆరోగ్యం, పర్యావరణ రక్షణ



సిలికాన్ కప్పులను చూపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సీపీ శ్వేత, అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్(ఫైల్)



కప్పులను అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

పాటల ద్వారా అవగాహన

- రుతుప్రేమ చైతన్య రథంను ఇటీవల మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ రథం ఆయా గ్రామాలు, వార్డులకు రాగానే స్థానిక అంగన్‌వాడీ టీచర్, ఆర్‌పీల సహకారంతో క్లాత్ ప్యాడ్, సిలికాన్ కప్పుల గురించి వివరిస్తారు.
- పాటలను సైతం రూపొందించి వాటి ద్వారా వివరిస్తున్నారు. అదే రథంలో ప్రభుత్వం సబ్సిడీ ద్వారా క్లాత్ ప్యాడ్‌లు, సిలికాన్ కపులు విక్రయిస్తున్నారు. సెట్విన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ ప్యాడ్‌లకు దీటుగా క్లాత్ ప్యాడ్‌లను రూపొందిస్తున్నారు. క్లాత్ ప్యాడ్‌లను కుట్టేందుకు సుమారుగా 25 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.

మహిళలు గొప్పగా చెప్పకోవాలి



డైపర్‌లు, ప్యాడ్‌ల వినియోగం వల్ల రసాయనాలతో ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుంది. రుతుప్రేమ ద్వారా క్లాత్ ప్యాడ్‌లు, సిలికాన్ కప్పులను వినియోగించాలని మహిళలు, యువతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. రుతుప్రేమ మా ఆరోగ్యం కోసమే అని మహిళలు గొప్పగా చెప్పుకోవాలి. ఇప్పటికే సిద్దిపేటలో 4వ వార్డులో జీరో శానిటరీ వేస్ట్ కోసం అడుగులు పడుతున్నాయి. త్వరలో నారాయణరావుపేటలో సైతం అవుతుంది. అదే స్ఫూర్తితో సిద్దిపేట అంతటా కార్యక్రమాలను నిర్వహిస్తాం.

– డాక్టర్ శాంతి, పర్యావరణవేత్త

మా పిల్లలతో వాడిస్తున్నాం



మా పిల్లలతో పాటు హాస్టల్ విద్యార్థులతో క్లాత్ ప్యాడ్‌లను వాడిస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగిస్తున్నారు. డిస్పోజబుల్ ప్యాడ్‌ల వినియోగం వల్ల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి హాని కలుగుతుంది. ఒకరు ఐదుగురు, పది మందిని మార్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. మంచిని స్వీకరించండి, చెడును వదిలేద్దాం అని మహిళలకు సూచిస్తున్నా. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరతో దేశంలో ఎక్కడలేని విధంగా రుతుప్రేమ కార్యక్రమానికి స్వీకారం చుట్టారు.

– సరోజ, రుతుప్రేమ నోడల్ అధికారి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి

రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎగ్జిబిట్లు



సెక్యూరిటీ అలారం సిస్టమ్ ఎగ్జిబిట్

దుబ్బాకటౌన్: రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్దిపేట జిల్లా నుంచి 7 ఎగ్జిబిట్స్ ఎంపికయ్యాయి. ఈనెల 9 నుంచి 11 వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరుగుతుంది. ఇందు కోసం ఇటీవల సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో దుబ్బాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సీఎం కేసీఆర్ స్కూల్) కు చెందిన 9 వ తరగతి విద్యార్థి ఎం.మనీశ్ గైడ్ టీచర్ బాలయ్య ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన లేజర్ సెక్యూరిటీ అలారం ప్రదర్శన జిల్లాస్థాయిలో సీనియర్ విభాగంలో మొదటి బహుమతి గెలుచుకొని రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. దీంతో పాటు మరో ఆరు పాఠశాలలకు చెందిన ఎగ్జిబిట్స్‌తో పాటు ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొనేందుకు నిర్మల్ వెళ్లారు.

కులగణనతోనే సామాజిక న్యాయం



ఉత్తరాలను ప్రదర్శిస్తున్న నాయకులు

హుస్నాబాద్: జనాభా గణన సెన్సెస్లో బీసీల అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రధానికి కోటి ఉత్తరాల ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పలువురు బీసీలు ఉత్తరాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి ఉత్తరాల కార్యక్రమ రూపకర్త పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. బీసీల లెక్క తేలితేనే రాజ్యాంగపరంగా మనకు రావాల్సిన హక్కులు సాధ్యమవుతాయన్నారు. రాజ్యాంగ ప్రకారం మేం ఎంతో మాకు అంత అనే నినాదాన్ని బలంగా వినిపిస్తున్నామన్నారు. కులగణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, బీసీల జనాభాను లెక్కించాలని ఆయన డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త వడ్డెపల్లి మల్లేశం, బీసీ సంఘాల నాయకులు బొడ్డు ఈశ్వర్, వేముల రాజేశం, చికోటి మహేశ్, కొత్తపల్లి మహేందర్ పాల్గొన్నారు.

ఇతర వర్క్ అడ్జెస్ట్‌మెంట్ రద్దుచేయాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలో ఉపాధ్యాయుల ఇతర వర్క్ అడ్జెస్ట్‌మెంట్ విధానం రద్దుచేసి, అవసరమైన పాఠశాలలకు వారిని కేటాయించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్)జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో గల టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా పాఠశాలల్లో విషయ ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోందని, పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నా కూడా ఉన్నత పాఠశాలల్లో ఇంకా విషయ ఉపాధ్యాయుల కొరత కనిపిస్తుందన్నారు. విషయ ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న పాఠశాలల నుంచి లేని పాఠశాలలకు ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్ మెంట్ ప్రక్రియ ద్వారా కేటాయించాలి కానీ, సంగారెడ్డి జిల్లాలో పాఠశాలల అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా, ఉపాధ్యాయుల సౌకర్యార్థం వారిని సర్దుబాటు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఏయే పాఠశాలల్లో విషయ ఉపాధ్యాయులు కొరత ఉందో ఆ పాఠశాలలకు వారిని సర్దుబాటు చేయాలని కోరారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర విద్యా మహాసభలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత వేసవి సెలవుల్లో పదో తరగతి, ఇంటర్ పరీక్షల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు ప్రయోజనం పొందేందుకు జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, నాగేశ్వర్ రావు, జీవన్ రావ్, భాస్కర్, కమురొద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్ పటేల్, జనార్దన్ రెడ్డి, విజయ్ భాస్కర్, బిచ్చయ్య, జిల్లా కార్యదర్శులు మర్రి ప్రశాంతి, మల్లికార్జున్ జీవోల కమిటీ సభ్యులు పుండరీకం, జగదీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట మాకు ఆదర్శం

సిద్దిపేట జోన్: సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తరహాలో వనపర్తిలో మార్కెట్ ఏర్పాటు కోసం మంత్రి నిరంజన్ రెడ్డి సహకారాన్ని తీసుకోని సాగుతామని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్ గౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును సందర్శించారు. మంత్రి హరీశ్ రావు ముందు చూపుతో సిద్దిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసారని, సిద్దిపేట మాకు ఆదర్శంగా ఉందని వారు పేర్కొన్నారు. అంతకుముందు కోమటిచెరువు, సందర్శించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్, సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్ బ్రహ్మం తదితరులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



కాశీ విశ్వనాథం (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ సంఘటనలు జిన్నారం మండలంలో ఆదివారం జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన కాశీ విశ్వనాథం(19)అనే పౌరోహిత్యం చేస్తుంటాడు. కొడకంచిలో శివస్వాములు మాలలు ధరించే పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు గాను బొంతపల్లి నుంచి జిన్నారం మీదుగా బైక్‌పై ఆదివారం ఉదయం తెల్లవారు జామున 4 గంటలకు బయలుదేరారు. జిన్నారంలోని మినీస్టేడియం ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న జేసీబీ వాహనం అదుపుతప్పి విశ్వనాథం బైక్‌ను ఢీ కొట్టింది. జేసీబీ అరకిలోమీటర్ మేర రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. దీంతో విశ్వనాథం అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఆటో ఢీకొని మరో వ్యక్తి..

జిన్నారం మండలంలోని సోలక్‌పల్లిలో సంత ఉండటంతో కూరగాయలను కొనుగోలు చేసి ఒడిషాకు చెందిన శిశుతండియా(34)అనే వ్యక్తి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి శిశుతండియాను ఢీకొట్టింది. దీంతోఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుశిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్‌ఐ మోతీలాల్ తెలిపారు.

ప్రవక్త జీవితంపై అవగాహన ఉండాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేటజోన్: పిల్లలకు చిన్న తనంలో మహ్మద్ ప్రవక్త జీవితంపై అవగాహన ఉండాలని, అందులో భాగంగానే పరీక్షలు నిర్వహించినట్టు హజ్రత్ మౌలానా అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఇక్బాల్ మినార్ ఈద్గా దర్గాలో సిద్దిపేట జిల్లా జమియత్ ఉలమా ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు సిరత్ పట్ల అవగాహన తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో హజ్రత్ ముఫ్తి సలాం, మౌలానా, హాఫిజ్ ఫిర్, హాఫిజ్ అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బియ్యం 5 కిలోలేనా ?



రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ

దుబ్బాకటౌన్: పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించేల ప్రభుత్వాలు ప్రతినెలా రేషన్ దుకాణాల ద్వారా బియ్యాన్ని సరఫరా చేస్తున్నాయి. ఈ క్రమంలోనే కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం మరో ఏడాది (జనవరి 2023 నుంచి డిసెంబర్ వరకు) ఉచిత బియ్యం పంపిణీ చేస్తామంటూ తీపికబురు అందించింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 5 కిలోలే ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంతో పేదకుటుంబాలు తీవ్ర నిరాశకు గురవుతున్నాయి. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు యూనిట్‌కు 5 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం పెంచకుండా 5 కిలోల చొప్పునే ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంతో పేదకుటుంబాల్లో అసంతృప్తి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం 2 ఏళ్లుగా గరీబ్ కల్యాణ్ యోజనను అమలు చేస్తోంది. ఆహార భద్రత కార్డులోని ప్రతీ లబ్ధిదారుడికి 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం కోటా కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం మరో 5 కిలోలు కలిపి 10 కిలోల చొప్పున అందిస్తూ వస్తుంది. ఉచిత బియ్యం కాలపరిమితి మార్చి 2022తో ముగియగా కేంద్రం మరోసారి డిసెంబర్ వరకు పొడిగించింది. ఏప్రిల్, మే, జూన్‌లో ఉచిత బియ్యం పంపిణీ జరగలేదు. రూపాయికి కిలో చొప్పున అందించారు. జులై చివరలో నెలసరి కోటా పంపిణీ గడువు ముగియగానే యూనిట్‌కు 5కిలోల చొప్పున ఉచితంగా అందించింది. ఆగస్టు నుంచి 10 కిలోల చొప్పున డిసెంబర్ వరకు పంపిణీ చేసింది.


రాష్ట్రం తీసుకున్న నిర్ణయంతో ..

కేంద్రం ఏడాది పాటు 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకోగా రాష్ట్ర ప్రభుత్వం సైతం 5 కిలోలు ఇస్తే 10 కిలోలు వస్తాయని పేదలు ఆశపడ్డారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో యూనిట్‌కు 5 కిలోలే అందించాలని తాజాగా నిర్ణయం తీసుకోవడంతో పేద కుటుంబాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గతంలో రూపాయికి కిలో చొప్పున ప్రతి వ్యక్తికి 6 కిలోలు రాగా ఇప్పుడు 5 కిలోలే వస్తే ఏం సరిపోతాయని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రేషన్ దుకాణాలకు యూనిట్‌కు 5 కిలోల చొప్పునే కోటాచేరింది.

జిల్లాలో 2,92,205 రేషన్‌కార్డులు

జిల్లాలో 684 రేషన్ దుకాణాలు ఉండగా మొత్తం 2,92,205 రేషన్ కార్డులున్నాయి. ఆయా కుటుంబాల్లోని 9,05,523 మంది సభ్యులకు లబ్ధి చేకూరుతుంది. సాధారణ పరిస్థితుల్లో ప్రతీ 5,600 మెట్రిక్ టన్నుల బియ్యం ఇస్తుండగా కోవిడ్, ఇతర సందర్భాల్లో ఇప్పటివరకు నెలకు 10 కిలోల చొప్పున 13,389 మెట్రిక్ టన్నులు పంపిణీ చేస్తున్నాయి. ఇప్పుడు 5 కిలోల చొప్పున అంటే నెలకు 5,600 మెట్రిక్ టన్నులు పంపిణీ చేస్తారు.

10వ తేదీ నుంచి పంపిణీ



రేషన్ దుకాణాలకు 5 కిలోల చొప్పునే కోటా వచ్చింది. ప్రభుత్వం నుంచి సైతం రేషన్ కార్డులోని ప్రతి వ్యక్తికి 5 కిలోలే ఇవ్వాలని ఆదేశాలు సైతం జారీచేసింది. ఇంకా ఈపాస్‌లు ఓపెన్ కావడం లేదు. సాంకేతిక కారణాలతోనే ఓపెన్ కావడంలేదని తెలుస్తోంది. మొదట 7వ తేదీ అన్నారు, ఇప్పుడు 10వ తేదీనుంచి పంపిణీ చేయాలని చెబుతున్నారు.

– మంద లక్ష్మారెడ్డి, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి

మరో 5 కిలోలు ఇవ్వాలి



కేంద్రం 5 కిలోల చొప్పున మరో ఏడాది పాటు ఉచిత బియ్యం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ పంపిణీని పెంచకపోవడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం పేదల దయనీయమైన పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని 10 కిలోలు చొప్పున ఇవ్వాలి.

– ఎల్లారం రమేశ్, దుబ్బాక

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సింలు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మెదక్ రూరల్: పొలం పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన హవేళిఘణాపూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొల్మూరి నర్సింలు(54) వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం తన పాడి పశువులకు మేత తీసుకొచ్చేందుకు గ్రామ శివారులోని తన పొలానికి వెళ్లాడు. పొలంలోని బోరు మోటరు పక్కన గల పచ్చగడ్డిని కోస్తున్నాడు. ఈ క్రమంలో స్టార్టర్ బాక్స్‌కు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ తీగను గడ్డితో పాటే గమనించకుండా చేతిలో పట్టుకొని కత్తిరించడంతో విద్యుదాఘాతనికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.